క్లుప్తంగా

మార్కెట్‌లోకి ఎస్‌యూవీ జిమ్నీ కారు



ఎస్‌యూవీ జిమ్నీని మార్కెట్‌లోకి విడుదల చేస్తున్న ఏసీపీ శ్రీధర్‌రెడ్డి, కల్యాణి మోటార్స్ వైస్ ప్రెసిడెంట్ షాలిన్ చౌదరి

నాగోలు: కల్యాణి మోటార్స్–మారుతీ సుజుకి రూపొందించిన నూతన కారు ఎస్‌యూవీ–జిమ్నీని శనివారం ఎల్బీనగర్ ఏసీపీ శ్రీధర్‌రెడ్డి నాగోలులోని నెక్సా షోరూమ్‌లో విడుదల చేశారు. ఈ సందర్భంగా కల్యాణి మోటార్స్ వైస్ ప్రెసిడెంట్ షాలిన్ చౌదరి మాట్లాడుతూ, మారుతి సుజుకి నెక్సా ఎస్‌యూవీ జిమ్నీ రూపంలో కొత్త ఫీచర్లతో కారును మార్కెట్‌లోకి విడుదల చేసిందన్నారు. కార్యక్రమంలో కల్యాణి మోటార్ బిజినెస్ సేల్స్ హెడ్ స్టీవెన్స్ రెజినాల్డ్, ఎల్బీనగర్ ఎస్ఐ లింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శివసుధీర్ శర్మకు సత్కారం

నాగోలు: అలంకార బ్రహ్మ, జ్యోతిష్య పండితుడు గుండెపూడి శివ సుధీర్ శర్మకు డాక్టరేట్ దక్కింది. ఏసియా ఇంటర్నేషనల్ కల్చర్ రీసెర్చ్ యూనివర్సిటీ బెంగళూరులో నిర్వహించిన కార్యక్రమంలో శర్మకు డాక్టరేట్‌ను ప్రదానం చేశారు. కొత్తపేట మారుతినగర్‌లోని ప్రసన్నాంజనేయ స్వామి ఆలయంలో శర్మ ప్రధాన అర్చకుడిగా పని చేస్తున్నాడు. డాక్టరేట్ వచ్చినందుకు అభినందనలు తెలుపుతూ ప్రసన్నాంజనేయ ఆలయ కమిటీ సభ్యులు ఆయనను శాలువాతో సత్కరించి జ్ఞాపిక అందజేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ లింగాల నాగేశ్వరరావు, మారుతినగర్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కె.మల్లేశం, ప్రతినిధులు పీఎస్ రాయుడు, రాజనాల, సుబ్బారెడ్డి, నిరంకి రవి, రామారావు, వెంకటనారాయణ తదితరులు పాల్గొన్నారు.



శివసుధీర్ శర్మను సత్కరిస్తున్న నాగేశ్వరరావు తదితరులు

ఎల్‌బీనగర్ బీఆర్‌ఎస్‌లో వర్గపోరు

- ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, రాంమోహన్ గౌడ్‌ల మధ్య ఆధిపత్య పోరు
- మంత్రి కేటీఆర్ సమక్షంలోనే ఇరువర్గాల బాహాబాహీ

వనస్థలిపురం: ఎన్నికలు సమీపిస్తున్న వేళ ఎల్‌బీనగర్ బీఆర్‌ఎస్‌లో గ్రూపు తగాదాలు ఊపందుకున్నాయి. ఇప్పటివరకు నివురుగప్పిన నిప్పులా ఉన్న ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, పార్టీ ఎల్‌బీనగర్ ఇన్‌చార్జ్ ముద్దగోని రాంమోహన్‌గౌడ్‌ల మధ్య వర్గపోరు తారస్థాయికి చేరుకుంది. మంత్రి కేటీఆర్ సమక్షంలోనే ఇరువర్గాలు బాహాబాహీకి దిగాయి. ఇందుకు పురపాలక, ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ వనస్థలిపురం పర్యటన వేదికగా మారింది. వివరాల్లోకి వెళ్తే.. మంత్రి కేటీఆర్ ప్రైవేట్ సెక్రటరీ కానుగుల శ్రీనివాస్ వనస్థలిపురం ప్రశాంత్‌నగర్‌లో నివాసం ఉంటున్నారు. శ్రీనివాస్ తల్లి రాములమ్మ గత నెల 18న మృతి చెందారు. ఆ సమయంలో మంత్రి కేటీఆర్ విదేశీ పర్యటనలో ఉన్నారు. విదేశాల నుంచి తిరిగి వచ్చిన ఆయన శనివారం శ్రీనివాస్ కుటుంబాన్ని పరామర్శించడానికి శాంత్‌నగర్‌కు వచ్చారు. కేటీఆర్ రాక సందర్భంగా ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, రాంమోహన్‌గౌడ్, బీఆర్‌ఎస్ మాజీ కార్పొరేటర్లు, నాయకులు పెద్దసంఖ్యలో అక్కడికి వచ్చారు. కాగా కేటీఆర్ వెళ్లిపోయే సమయంలో సుధీర్‌రెడ్డి అనుచరులు సుధీర్‌రెడ్డి జిందాబాద్ అంటూ నినాదాలు చేయడంతో, ప్రతిగా రాంమోహన్ గౌడ్ అనుచరులు రాంమోహన్‌గౌడ్ జిందాబాద్ అంటూ పెద్దపెట్టున నినాదాలు చేశారు. ఇరు గ్రూపుల నినాదాలతో ఉద్రిక్తత నెలకొని ఒకరినొకరు నెట్టుకునే వరకు పరిస్థితి వెళ్లింది. పోలీసులు జోక్యం చేసుకుని ఇరువర్గాలను సముదాయించి అక్కడి నుంచి పంపించివేసి పరిస్థితిని చక్కదిద్దారు. ఎన్నికల ముందే బీఆర్‌ఎస్‌లో గ్రూపు రాజకీయాలు ఇలా ఉంటే.. ఎన్నికల సమయంలో ఇంకా ఎలా ఉంటాయోనని స్థానికులు పేర్కొంటున్నారు.



బాహాబాహీకి దిగిన సుధీర్‌రెడ్డి, రాంమోహన్‌గౌడ్ అనుచరులు



వనస్థలిపురం వచ్చిన మంత్రి కేటీఆర్‌తో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, రాంమోహన్‌గౌడ్ తదితరులు

సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తా

ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

హయత్‌నగర్: ఎల్బీనగర్ నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరించి రాష్ట్రంలోనే ఆదర్శవంతమైన నియోజకవర్గంగా తీర్చిదిద్దుతామని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. శనివారం స్థానిక కార్పొరేటర్ నవజీవన్‌రెడ్డితో కలిసి హయత్‌నగర్ డివిజన్‌లో సుమారు 1.38 కోట్లతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. వీరభద్రనగర్ ఫేజ్–2లో రూ.24 లక్షలతో నిర్మించే సీసీ రోడ్డు పనులను, ఆనంద్‌నగర్‌లో రూ.18 లక్షలతో నిర్మించే సీసీ రోడ్డు, అన్మగల్ బస్తీలో రూ.12.5 లక్షలతో నిర్మించే సీసీ రోడ్డుకు, షిర్డీ నగర్‌లో రూ.39.6 లక్షలతో నిర్మించే సీసీ రోడ్డు పనులకు, హుడా సాయినగర్‌లో రూ.21 లక్షలతో అంతర్గత డ్రైనేజీ పనులకు, ఆటో సాయినగర్‌లో రూ. 8.5 లక్షలతో చేపట్టే అంతర్గత డ్రైనేజీ నిర్మాణానికి శంస్థాపన చేశారు. అలాగే, హయత్‌నగర్ ఓల్డ్ విలేజ్‌లో బస్తీ దవాఖానాను ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఎల్‌బీనగర్‌ను సమస్యలు లేని నియోజకవర్గంగా చేసి రోల్ మోడల్‌గా తీర్చి దిద్దేందుకు కృషి చేస్తున్నామన్నారు.



ఆనంద్‌నగర్‌లో సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

మహిళ, శిశుసంక్షేమానికి కేంద్రం పెద్దపీట

మలక్‌పేట: కేంద్ర ప్రభుత్వం మహిళ, శిశుసంక్షేమానికి పెద్దపీట వేస్తోందని మూసారంబాగ్ బీజేపీ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి మధుసూదన్‌రెడ్డి అన్నారు. శాలివాహననగర్ అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం పౌష్టికాహారంపై నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి కార్పొరేటర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పిల్లల ఆరోగ్యంపై తల్లిదండ్రులు శ్రద్ధ తీసుకోవాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో మెరుగైన సౌకర్యాలు కల్పించడానికి కృషి చేస్తామన్నారు. ప్రధాని మోదీ సర్కార్ కుల, మతాలకు అతీతంగా పని చేస్తోందని, కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం అంగన్‌వాడీ సెంటర్‌లో పిల్లలకు వేస్తున్న వ్యాక్సినేషన్‌ను పరిశీలించి సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ రాధ, గాయత్రి, రమాదేవి, తులసి, ఎస్‌ఎఫ్‌ఏ ముజీబ్, మల్లేష్, దినేష్, తదితరులు ఉన్నారు.

మలక్‌పేట సమగ్రాభివృద్ధికి కృషి



సైదాబాద్‌లో వాటర్ పైప్‌లైన్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే అహ్మద్ బలాల

సైదాబాద్: ప్రణాళికాబద్ధంగా మలక్‌పేట నియోజకవర్గ సమగ్రాభివృద్ధికి కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే అహ్మద్ బలాల అన్నారు. శనివారం ఆయన సైదాబాద్ డివిజన్ కార్పొరేటర్‌తో కలిసి సైదాబాద్ ధోబీ ఘాట్‌లో నూతనంగా నిర్మించిన వాటర్ పైప్‌లైన్‌ను ప్రారంభించారు. అనంతరం ఆయన బస్తీ సంక్షేమ సంఘం నాయకులతో కలిసి సాయిరాం కాలనీలో పర్యటించారు. బస్తీలో నెలకొన్న సమస్యల గురించి స్థానికులు ఆయనకు తెలిపారు. సంబంధిత అధికారులతో చర్చించి పరిష్కరిస్తానని వారికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వాటర్‌వర్క్స్ డీజీఎం షీలారాణి, జీహెచ్‌ఎంసీ ఏఈ వెంకన్న పాల్గొన్నారు.

మంత్రి హరీశ్‌రావుకు జన్మదిన శుభాకాంక్షలు



రాష్ట్ర ఆర్థిక, వైద్యారోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు పుట్టినరోజు సందర్భంగా ఆయనను శనివారం నానక్‌రామ్‌గూడలోని నివాసంలో కలిసి శుభాకాంక్షలు తెలుపుతున్న రాష్ట్ర టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ పూర్వ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా. – నాగోలు

మాన్‌సూన్ వాహనాలు సిద్ధం: జెడ్సీ

ఎల్‌బీనగర్: రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని ముందస్తుగా మాన్‌సూన్ వాహనాలను, సిబ్బందిని సిద్ధం చేశామని ఎల్‌బీ నగర్ జోనల్ కమిషనర్ పంకజ తెలిపారు. శనివార ఆమె జెడ్సీ కార్యాలయ ఆవరణలో మాన్‌సూన్ వాహనాలను జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఎల్‌బీనగర్ జోనల్ కార్యాలయ పరిధిలోని 23 వార్డులు ఉండగా, ప్రతీ వార్డుకు ఒక మాన్‌సూన్ వాహనంతో పాటు అత్యవసర సేవలకు నలుగురు కార్మికులతోకూడిన 23 ట్రాక్టర్లు, 12 స్టాటిక్ బృందాలు, ఇద్దరు కార్మికులను సిద్ధం చేశామన్నారు. కార్యక్రమంలో జోనల్ అధికారులు అశోక్‌రెడ్డి, హరిలాల్, కప్రా, నాగేందర్, రమేస్‌బాబు, కోటేశ్వరరావు, శ్రీనివాసులు పాల్గొన్నారు.



మాన్‌సూన్ వాహనాలను ప్రారంభిస్తున్న పంకజ

వ్యవసాయరంగంలో అద్భుత ప్రగతి : ఎమ్మెల్యే

ఎల్‌బీనగర్: తెలంగాణ రాష్ట్రం ఈ దశాబ్ద కాలంలో అద్భుతమైన ప్రగతి సాధించిందని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఎన్టీఆర్‌నగర్‌లోని రైతుబజార్‌లో శుక్రవారం రైతు సన్మాన సభ నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే రైతులను సన్మానించి మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పడినప్పుడు వరి ఉత్పత్తిలో దేశంలో 15వ స్థానంలో ఉండగా... నేడు అగ్రగామిగా ఉందని, ఉత్పాదకతలో తెలంగాణ రెండవ స్థానంలో ఉందని ఆయన చెప్పారు. ఈ ఘనత కేవలం ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావుకే దక్కుతుందన్నారు. దేశంలో ఎక్కడా లేని పథకాలను రైతులకు అందించి వారి అభివృద్ధికి కేసీఆర్ కృషి చేస్తున్నారన్నారు. అనంతరం పలువురు రైతులను ఎమ్మెల్యే సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌సీ దయానంద్‌గుప్తా, నాయకులు విఠల్ రెడ్డి, ప్రవీణ్‌కుమార్, సాగర్‌రెడ్డి, ఈశ్వరమ్మయాదవ్, పలువురు నాయకులు పాల్గొన్నారు.



కూరగాయల రైతులను సన్మానించిన ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, ఎంఎల్‌సీ దయానంద్

వాసవి మాత ఆలయంలో ప్రత్యేక పూజలు

వనస్థలిపురం: సచివాలయ నగర్‌లోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో ఆలయ అష్టమ వార్షికోత్సవాలను నాలుగు రోజులుగా ఘనంగా నిర్వహిస్తున్నారు. వేడుకల్లో భాగంగా శనివారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి ప్రధాన కార్యదర్శి రావినూతల శశిధర్, ఆలయ చైర్మన్ వేముల జయరాములు, ఫౌండర్ చింతల రవికుమార్, ప్రధాన కార్యదర్శి లక్ష్మీనారాయణతో పాటు వనస్థలిపురం ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు తడకమళ్ల విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

జీఓ 58,59లతో ప్రభుత్వం రియల్ ఎస్టేట్ వ్యాపారం: సామ

మన్సూరాబాద్: జీఓ నంబర్ 58, 59లతో బీఆర్‌ఎస్ ప్రభుత్వం రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నదని రంగారెడ్డి అర్బన్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు సామ రంగారెడ్డి ఆరోపించారు. శనివారం మన్సూరాబాద్ డివిజన్ పరిధిలోని వీరన్నగుట్టలో స్థానిక కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డితో కలిసి ఆయన పర్యటించారు. అక్కడ చేపట్టిన ఇళ్ల కూల్చివేతలను ఆపాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బస్తీ వాసులు తాము ఎదుర్కొంటున్న సమస్యలను రంగారెడ్డికి వివరించారు. గత కొన్నేళ్లుగా తాము ఇక్కడే నివాసం ఉంటున్నామని, 2014లో బీఆర్‌ఎస్ ప్రభుత్వం 58 జీఓ కింద 120 గజాల లోపు ఉన్న ప్లాట్లను ఉచితంగా క్రమబద్ధీకరిస్తామంటే, 60 గజాల చొప్పున ఉన్న ప్లాట్లకు దరఖాస్తు చేసుకున్నారని రంగారెడ్డి తెలిపారు. కానీ ఇప్పుడు జీఓ 59 కింద లక్షల రూపాయలు చెల్లించాలని వారికి ప్రభుత్వం నోటీసులు జారీ చేయడం ఎంతవరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు. కార్యక్రమంలో రామేశ్వర్, కొండల్‌రెడ్డి, కడారి యాదగిరియాదవ్, కోటయ్య, చిన్నయాదవ్, చింటు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

ఇద్దరు హెడ్ కానిస్టేబుళ్లకు ఏఎస్‌ఐలుగా పదోన్నతి

నాగోలు: రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా చేపట్టిన ప్రభుత్వ ఉద్యోగుల పదోన్నతుల్లో భాగంగా ఎల్‌బీనగర్ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ఇద్దరు హెడ్ కానిస్టేబుళ్లకు ఏఎస్‌ఐలుగా ప్రమోషన్ లభించింది. రైటర్‌గా విధులు నిర్వహిస్తున్న ఎస్.విక్రమ్ రెడ్డి, పెట్రోల్ మొబైల్ విధులు నిర్వహిస్తున్న అంజయ్యకు ఏఎస్‌ఐలుగా పదోన్నతి కల్పిస్తూ పోలీస్ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ప్రమోషన్ లభించిన విక్రమ్ రెడ్డి, అంజయ్యలకు శనివారం ఎల్‌బీనగర్ ఏసీపీ శ్రీధర్‌రెడ్డి, ఎల్‌బీనగర్ సీఐ అంజిరెడ్డి బ్యాడ్జీలు అందజేసి అభినందించారు. తమకు ఏఎస్‌ఐలు అవకాశం కల్పించిన ఉన్నతాధికారులకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

కేసీఆర్‌తోనే వ్యవసాయానికి మంచి రోజులు: హోంమంత్రి



మాట్లాడుతున్న హోంమంత్రి మహమూద్ అలీ

చాదర్‌ఘాట్: వ్యవసాయ రంగ అభివృద్ధికి ముఖ్యమంత్రి కేసీఆర్ చేపట్టిన ప్రణాళికలు దేశంలోనే నంబర్ వన్‌గా నిలిచాయని హోంమంత్రి మహమూద్ అలీ అన్నారు. శనివారం మలక్‌పేటలోని హైదరాబాద్ వ్యవసాయ మార్కెట్‌లో దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా రైతు దినోత్సవంలో ఆయన మాట్లాడారు. రైతు బంధు, రైతు బీమా, 24 గంటల విద్యుత్ సరఫరా, వివిధ పంటలకు రాయితీలు కల్పించిన ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్‌దేనన్నారు. రైతు బంధు పథకం ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటి వరకు 343.48 కోట్లు పెట్టుబడి సాయంగా ప్రభుత్వం అందించిందన్నారు. వ్యవసాయ యాంత్రీకరణద్వారా సబ్సిడీపై 2534 మంది రైతులకు వ్యవసాయ పరికరాలకు రూ.2.52 కోట్లు అందించారని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే బలాల, చైర్‌పర్సన్ అనితా నాయక్, కార్పొరేటర్ షఫీయుద్దీన్ పాల్గొన్నారు.

ప్రత్యంగిరా దేవిని దర్శించుకున్న ఎల్బీనగర్ ఏసీపీ

దిల్‌సుఖ్‌నగర్: ఆర్‌కేపురం డివిజన్‌లోని కుర్తాళం శ్రీ సిద్ధేశ్వరి పీఠం ఆది పరాశక్తి శ్రీ ప్రత్యంగిరా పరమేశ్వరి అమ్మవారిని ఎల్‌బీనగర్ ఏసీపీ శ్రీధర్ రెడ్డి శనివారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ సెక్రెటరీ మునిపల్లె శ్రీనివాస్, సువర్ణలత దంపతులు వారికి అమ్మవారి జ్ఞాపకను ప్రసాదాన్ని అందజేశారు.

మ్యాన్‌హోళ్ల పనుల్లో నాణ్యత పాటించాలి

చైతన్యపురి: మ్యాన్‌హోళ్ల పనులను నాణ్యతతో చేపట్టాలని గడ్డిఅన్నారం డివిజన్ కార్పొరేటర్ బద్దం ప్రేమ్ మహేశ్వర్‌రెడ్డి అధికారులకు సూచించారు. డివిజన్‌లోని పటేల్ నగర్ కాలనీలో జరుగుతున్న మ్యాన్ హోల్ నిర్మాణ పనులను కార్పొరేటర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రేమ్‌మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ, రహదారులపై భారీ వాహనాలు వెళ్లడం వల్ల నాసిరకంగా ఏర్పాటు చేసిన మ్యాన్‌హోళ్లు ధ్వంసమవుతున్నాయన్నారు. దీంతో మళ్లీ మళ్లీ పనులు చేయటం వల్ల ప్రజాధనం దుర్వినియోగం కావడమే కాకుండా కాలనీవాసులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు. జీహెచ్‌ఎంసీ వర్క్ ఇన్‌స్పెక్టర్ వెంకటేష్, స్థానికులు పాల్గొన్నారు.

రక్తదానానికి యువత ముందుకు రావాలి

నాగోలు: యువత రక్తదానం చేయడానికి ముందుకు రావాలని లయన్స్‌క్లబ్ హెల్త్ క్యాంప్ చైర్మన్ డాక్టర్ బి.విజయరంగా కోరారు. ఈ మేరకు ఆయన శనివారం కొత్తపేటలో కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సమాజంలో రక్తదాతలు ఇచ్చే రక్తం ఆపదలో ఉన్న వారికి సరిపోవడం లేదని, సమయానికి రక్తం అందక ఎంతోమంది మృత్యువాత పడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్డు ప్రమాద క్షతగాత్రులతో పాటు వివిధ ఆపరేషన్లు చేయించుకొనే వారు ఆసుపత్రుల్లో రక్తం కోసం ఎదురుచూస్తున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలోనే యువత ముందుకు వచ్చి రక్తదానం చేయడంతో పాటు రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేయాలని కోరారు. ఈ శిబిరాలకు శ్రీ విద్య బ్లడ్ బ్యాంక్ చైర్మన్ కొమ్మూరి ప్రకాష్ సహకరిస్తారని తెలిపారు.

న్యాయవాదుల సమస్యలపై రౌండ్ టేబుల్ సమావేశం

రంగారెడ్డి కోర్టులు: రంగారెడ్డి జిల్లాకోర్టు న్యాయవాద సంఘం అధ్యక్షుడు డీకొండ రవీందర్ పిలుపు మేరకు... న్యాయవాదుల రక్షణ చట్టం, 41(ఎ) సీఆర్‌పీసీ, న్యాయవాదుల బీమా తదితర అంశాలపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. శనివారం జిల్లా కోర్టు ఆవరణలో నిర్వహించిన ఈ సమావేశంలో ఉమ్మడి రంగారెడ్డి జిల్లా, జంట నగరాల అన్ని కోర్టుల న్యాయవాద సంఘాల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు. సమావేశానికి హాజరైన పలువురు న్యాయవాదులు ఎదుర్కొంటున్న సమస్యలు, న్యాయవాదులపై జరుగుతున్న దాడులపై చర్చించారు. జూన్ నెల ఆఖరి వారంలో రాష్ట్రంలోని అన్ని కోర్టుల న్యాయవాద సంఘాలను సమావేశపరచి సమష్టిగా న్యాయవాదుల సంక్షేమంపై కార్యాచరణ రూపొందించి ముందుకు సాగుతామని సంఘం ప్రధాన కార్యదర్శి పట్లోళ్ల మాధవ రెడ్డి అన్నారు. బార్ కౌన్సిల్ సభ్యులు ధన్వాడ మధుసూదన్ రావు, రామారావు ఆకుల అనంత్‌సేన్ రెడ్డి, ములుగురి ఫణీంద్ర భార్గవ్, సీనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

మహిళ అదృశ్యం

హస్తినాపురం: మహిళ అదృశ్యమైన ఘటన వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం... నాగర్‌కర్నూల్ జిల్లా యాపట్ల గ్రామానికి చెందిన తడారి తిరుపతమ్మ (50), మాసయ్య దంపతులు హస్తినాపురం ఈస్ట్ కాలనీలో నివాసం ఉంటున్నారు.. శుక్రవారం మధ్యాహ్నం ఇంట్లో వారికి చెప్పకుండా తిరుపతమ్మ బయటకు వెళ్లింది. సాయంత్రం వరకు తిరిగి రాకపోవడంతో కంగారుపడ్డ ఆమె కుటుంబ సభ్యులు బంధు,మిత్రులను వాకబు చేసినా ఆమె ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో భర్త పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



తిరుపతమ్మ